క్లుప్తంగా

నేడు కనపర్రు చర్చిలో నిశ్చితార్థ మహోత్సవం



నాదెండ్ల: కనపర్రులోని పురాతన ఆర్‌సీఎం చర్చిలో గురువారం పునీత మరియ జోజప్పల కల్యాణ నిశ్చితార్థ మహోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య, వివిధ ప్రాంతాల మత గురువులు హాజరుకానున్నారు. ఉదయం 5.30 గంటలకు మొదటి పూజ, 10 గంటలకు సమిష్టి పూజాబలి నిర్వహించనున్నారు. మధ్యాహ్నం కొవ్వొత్తుల సమర్పణ, రాత్రి బాణసంచాతో విన్యాసాలు, అనంతరం తేరు ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమాలను స్థానిక విచారణ గురువు పగడాల చిన్నప్ప పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మత గురువులు జి. సురేష్, లింగారెడ్డి లూర్దురెడ్డి, యద్దనపల్లి రాజేష్, జ్యోతిరాజు, దాసరి జోజయ్య, గంటల ఉదయరాజు, పూదోక విలియం ప్రసంగించారు.

కార్మికుల సంరక్షణతోనే పరిశ్రమల అభివృద్ధి



యడ్లపాడు: కార్మికుల సంరక్షణతోనే పరిశ్రమలు అభివృద్ధి దిశగా పయనిస్తాయని వసుంధర నూలు మిల్లు మేనేజింగ్ డైరెక్టర్ గుంటుపల్లి కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని బోయపాలెం వసుంధర నూలుమిల్లులో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. మిల్లు యాజమాన్యం, కాటూరి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మిల్లు కార్మికులతో పాటు గ్రామంలోని పేదలు వివిధ పరీక్షలు, చికిత్సలను పొందారు. సీజనల్ వ్యాధులు, లక్షణాలు, నివారణ చర్యలపై వైద్యబృందం అవగాహన కల్పించింది. శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు నగీన్, వైష్ణవి ప్రియ, హరిత, షేక్ రహీన, బ్రెన్ పాల్గొని 200 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిల్లు మేనేజింగ్ డైరెక్టర్లు గుంటుపల్లి సుభాష్, గుంటుపల్లి రవికుమార్, మేనేజర్ కె. లింగయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే విడుదల చేయాలి



నరసరావుపేట: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పే రివిజన్ కమిషన్ నేటికీ నియమించకపోవడంతో 18 నెలల కాలాన్ని కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. అంతేకాకుండా గత 11వ పీఆర్‌సీకి సంబంధించిన బకాయిలు రూ.7,384 కోట్లు, డీఏ బకాయిలు రూ.9,650 కోట్లు, ఎంప్లాయి సరెండర్ లీవ్ రూ.2,250కోట్లు, సీపీఎస్ ఎంప్లాయిస్ బకాయిలు 2500 కోట్లు, ఏపీ జీఎల్ఐ రూ.950కోట్లు వెంటనే చెల్లించాలని కోరారు. తక్షణమే 12వ పీఆర్‌సీ కమిషన్‌ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించి పాత పెన్షన్ విధానాన్ని అమలుపర్చాలని కోరారు. ఐఆర్ 30శాతం వెంటనే ప్రకటించాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రవి, జిల్లా కార్యదర్శులు టి.వెంకటేశ్వర్లు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ లింగయ్య, రాష్ట్ర కుటుంబ సంక్షేమ ఆడిటర్ ప్రేమ్‌కుమార్, నరసరావుపేట మండలం, పట్టణ ప్రధాన కార్యదర్శులు సత్యానందరావు, వెంకటేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్‌లో చోరీ

నరసరావుపేట టౌన్: ప్రకాష్‌నగర్‌లోని ఓ ఇంటిలో బుధవారం చోరీ జరిగింది. దుండగుడు చొరబడి రూ.30 వేలతో పాటు బంగారపు చైన్, సెల్‌ఫోన్ అపహరించుకు పోయాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్‌నగర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పక్క వీధిలో నల్లపునేని మల్లికార్జునరావు అద్దె ఇంటిలో ఉంటున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం రాత్రి ఇంటి తలుపులకు గడియ పెట్టుకొని నిద్రపోయారు. ఉదయం లేచి చూసేసరికి ఇంట్లో రూ.30 వేలతో పాటు బంగారు చైన్, సెల్‌ఫోన్ కనిపించలేదు. సమాచారం అందుకున్న సీఐ విజయ్‌చరణ్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రిల్‌లో నుంచి తలుపు గడియ తొలగించి దుండగుడు ఇంట్లోకి ప్రవేశించినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పరాయి పంచన ఇంకెన్నాళ్లు?

- వెలుగు కార్యాలయానికి శాశ్వత భవనం కరువు
- అద్దె గదుల్లో మహిళా సభ్యుల అవస్థలు
- ఇరుకు గదుల్లో సమావేశాలు, రికార్డులు నిర్వహణ భారం



మండల వెలుగు కార్యాలయం

వినుకొండ(నూజెండ్ల): స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల్లో వెలుగుల నింపుతూ వారి అభ్యున్నతికి పాటు పడుతున్న మండల వెలుగు సమాఖ్య కార్యాలయానికి సొంత భవనం కరువైంది. అద్దె గదుల్లో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. వసతులు లేకపోవటంతో పాటు ఇరుకు గదుల్లో ఆగచాట్లు పడుతున్నారు. నూజెండ్ల మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 1,312 మంది డ్వాక్రా గ్రూపులకు గాను 41 మంది యానిమేటర్లు, ఆరుగురు క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు (సీసీ)తో కార్యాలయం నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రతి రోజు డ్వాక్రా మహిళల రికార్డులు తనిఖీలు, సమావేశాలు తదితర కార్యక్రమాలు ఇరుకు గదుల్లోనే జరుగుతాయి. సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలకు సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదుల్లో రికార్డుల నిర్వహణ, పర్యవేక్షణ భారంగా మారింది. దానికి తోడు తరుచూ కార్యాలయాన్ని వివిధ ప్రాంతాలకు మార్చడం వల్ల సాంకేతిక సమస్యలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డ్వాక్రా సంఘాల సభ్యులు, కార్యాలయ సిబ్బంది, యానిమేటర్లు కోరుతున్నారు.

శాశ్వత భవనం ఏర్పాటు చేయాలి



వెలుగు కార్యాలయంలో శాశ్వత భవనం లేకపోవడం అద్దె భవనాల్లో అవస్థలు పడుతున్నాం. గదులు ఇరుకుగా మారటంతో సమావేశానికి వచ్చిన మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవటంలో ఆగచాట్లు పడుతున్నాం. శాశ్వత భవనం ఏర్పాటు చేయాలి. –గుంటుపల్లి సుజాత, మండల గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు, నూజెండ్ల

స్థలం ఇస్తే తక్షణమే భవన నిర్మాణం



10 సెంట్ల స్థలాన్ని దాతలు వితరణ చేస్తే తక్షణమే వెలుగు కార్యాలయం భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.ఇందుకుగాను ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. స్థల సేకరణ సమస్య కారణంగా మండల వెలుగు కార్యాలయం భవన నిర్మాణ పనులు ఆగాయి. –రామాంజనేయులు, ఏపీఎం.నూజెండ్ల మండలం

రహదారి భద్రతతోనే ప్రమాదాల నివారణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంవీఐ శివనాగేశ్వరరావు, ఏఎంవీఐ వంశీకృష్ణ తదితరులు

నరసరావుపేట రూరల్: రహదారి భద్రత నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శివనాగేశ్వరరావు తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో రవాణాశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని తెలిపారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిర్దేశించిన వేగంతోనే రహదారులపై వాహనాలను నడపాలని సూచించారు.ి. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఎల్. వంశీకృష్ణ, కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ భూషణ్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం అవసరం

నరసరావుపేట: రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందని రోడ్డు భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హజరతయ్య పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసం సందర్భంగా బుధవారం ఆర్ అండ్ బీ కార్యాలయంలో పోస్టర్ విడుదల చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రహదారి భద్రత కమిటీలో రహదారులు భవనాల శాఖ కన్వీనర్‌గా ఉండాలని ప్రస్తుత ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయని తెలిపారు.

అమిత్ షాపై చర్యలు తీసుకోవాలి



నరసరావుపేట: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షులు గన్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయం నుంచి మల్లమ్మ సెంటర్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కాలినడకన శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్చార్జిలతో కలసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అలెగ్జాండర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కొనియాడుతున్న అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ అమిత్ షా మాట్లాడారని పేర్కొన్నారు. వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి, గురజాల, మాచర్ల, పెదకూరపాడు, నరసరావుపేట నియోజకవర్గాల ఇన్‌చార్జీలు బోయపాటి రామాంజనేయులు, మద్దుల రాధాకృష్ణ, చుక్కా చంద్ర పాల్, యలమందరెడ్డి, రామచంద్రారెడ్డి, పమిడి నాగేశ్వరావు, షేక్ మహబూబ్ బాషా, మహిళా అధ్యక్షురాలు తోట విజయలక్ష్మి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా గోపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు అందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



నరసరావుపేట: మున్సిపల్ కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఆప్కాసులో లేని కార్మికులను అందులో చేర్చి రూ.21వేల వేతనం చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయు) నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో శిథిలమై నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను బాగు చేయించి వాడుకలోనికి తీసుకునిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ మసూద్, ఆంజనేయ రాజు, తాతపూడి మల్లయ్య యోహాను, విజయలక్ష్మి, జీవరత్నం, నవీన్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే పశువుల ఆరోగ్య పరిరక్షణ



జాలాదిలో పశు వైద్యశిబిరం

యడ్లపాడు: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణ చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం కోట, సంతపేట, జగ్గాపురం, జాలాది గ్రామాల్లో శిబిరాలను నిర్వహించారు. యడ్లపాడు ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు వై. రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులంతా పశువులను తీసుకువచ్చి వ్యాధులు రాకుండా ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. జగ్గాపురం, జాలాది శిబిరంలో పశువైద్యులు పి. కిరణ్మయి, కోట, సంతపేట శిబిరాల్లో పశువైద్యులు రోజర్‌బెన్నీ సేవలందించారు. మేకలకు, దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

శావల్యాపురం: పశు ఆరోగ్య శిబిరాలను పాడి పోషకులు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ రామచంద్రరావు అన్నారు. బుధవారం మండలంలోని గుర్రంవారిపాలెం, ముండ్రువారిపాలెం గ్రామాల్లోని పశువైద్య శిబిరాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. రెండు గ్రామాల్లో 126 మంది రైతులు లబ్ధి పొందారు.

పాడి పోషణతో ఆర్థిక స్వావలంబన

నాదెండ్ల: వ్యవసాయానికి అనుబంధంగా పాడిపోషణతో రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం, ఆర్థిక స్వావలంబన లభిస్తుందని పశుసంవర్ధక శాఖ ఏడీ రాధాకృష్ణ చెప్పారు. నాదెండ్లలో స్థానిక పశువైద్యాధికారి ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. గణపవరంలో గ్రామీణ పశువైద్యశాల డాక్టర్ సాంబశివారెడ్డి, సాతులూరు పశువైద్యాధికారి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో చందవరంలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు కృత్రిమ గర్భధారణ పరీక్షలు, దూడలకు నట్టల నివారణ మందులు, ఎదకు రాని పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

రెండు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

రొంపిచర్ల: మండలంలోని ఎడ్వర్డ్‌పేట, బుచ్చిబాపన్నపాలెం గ్రామాలలో బుధవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో పశు వైద్యాధికారి డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి సేవలందించారు. పొదుగు వాపు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశు పోషకులకు వివరించారు. పాడి పశువులు ఆరోగ్యంగా ఉంటే పాల దిగుబడి పెరుగుతుందని తెలిపారు.

చిత్రకారుడు జెస్టిస్‌కు రెండు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్



జెస్టిస్ గీసిన చిత్రాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ మరో ఘనత సాధించారు. ఒకే రోజు రెండు అవార్డులు అందుకున్నారు. అమలాపురం కోనసీమ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ చిత్రకళా బ్రహ్మోత్సవాల అవార్డుల కార్యక్రమంలో భారత చిత్రకళారత్న బ్రహ్మోత్సవ్ అవార్డు, బ్రహ్మోత్సవ ఆర్ట్ లెజెండ్ అవార్డులు అందుకున్నారు. వినుకొండ సీమకు స్ఫూర్తిదాయకంగా, గర్వకారణంగా నిలిచిన జెస్టిస్‌ను వినుకొండకు చెందిన రాజకీయ ప్రముఖులు, న్యాయవాదులు, కవులు, రచయితలు, కళాకారులు, ఉపాధ్యాయులు, పాస్టర్లు, చిత్రకారులు అభినందించారు. మరెన్నో అవార్డులు, రివార్డులు సాధించాలని అభిలషించారు.

అలజడులకు కారణమవుతున్న అధికారుల చర్యలు



దిమ్మెకు రంగులు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ రూరల్ మండలం వెంకుపాలెంలో పంచాయతీ అధికారులు అత్యుత్సాహంతో వైఎస్సార్ విగ్రహానికి తెల్ల రంగు వేయడం వివాదాస్పదంగా మారింది. స్థానికులు ఈ ఘటనపై తీవ్రంగా వ్యతిరేకించడంతో రంగులు వేయడం ఆపేసి వెళ్లిపోవడం గమనార్హం. వారం రోజుల కిందట గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో ఉన్న పంచాయతీ భవనంపై టీడీపీ నేతలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆ పక్కనే వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ కూడా పక్కన ఏర్పాటు చేశారు. అయితే, ఈ విషయంపై కొందరు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎంపీడీవో కార్యాలయం నుంచి స్థానిక పంచాయతీ కార్యదర్శి వచ్చి రెండు పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు. అయితే, టీడీపీకి చెందిన నాయకులు సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం దిమ్మెకు మూడు రంగులు ఉన్నాయని, వెంటనే రంగులు మార్చాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. పంచాయతీ కార్యదర్శి అనుదీప్తి బుధవారం దగ్గర ఉండి మరీ తెల్లరంగు వేయించడంతో అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడి నుంచి వెనుదిరిగింది. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఎప్పుడో వేసిన వైఎస్సార్ విగ్రహానికి రంగులు పూయడం చర్చనీయాంశమైంది. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సున్నితమైన అంశాలను పక్కన పెట్టి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, ఇలాంటి ఘటనలు జరిగితే గ్రామాల్లో ఘర్షణలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన ఫలితాల సాధన కోసమే తనిఖీలు



శావల్యాపురం హైస్కూలులో నిత్యావసర వస్తువులను పరిశీలిస్తున్న సామాజిక టీమ్

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాల సాధన కోసం ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లో సామాజిక తనిఖీలు చేస్తున్నట్లు డీఆర్‌పీలు కె. శ్రీనివాసరావు, బి. భీమానాయక్ తెలిపారు. మండలంలోని కొండవీడు ఎంపీయూపీ పాఠశాలలో మంగళ, బుధ రెండు రోజులు సామాజిక బృంద సభ్యులు సమగ్ర పరిశీలన చేశారు. పాఠశాలలోని హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులను బయటకు పంపించి సమగ్ర సర్వే నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య, హాజరు నమోదు, డ్రాపౌట్స్, తరగతి గదులు, బెంచీలు, విద్యా బోధన తీరు, మధ్యాహ్న భోజన పథకం తదితర 172 అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, విద్యాధికారులతో చర్చించారు. వంటగది, ఆట స్థలం, ఉపాధ్యాయులకు అవసరమైన ఫర్నీచర్ లేనట్లు గుర్తించామని, వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని సభ్యులు తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సామాజిక టీమ్ సభ్యులు బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సామాజిక టీమ్ సభ్యుడు, ఎస్ఆర్‌పీ జె.ఎస్.రాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, నాణ్యత ప్రమాణాలు, మెనూ పాటించే విధానాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించామని తెలిపారు. విద్యాకానుక కిట్లు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు తదితర వినియోగంపై నేరుగా విద్యార్థుల అభిప్రాయ సేకరణ చేశామని చెప్పారు. భవిష్యత్‌లో తీసుకోవాల్సిన విధివిధానాలపై విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నామన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన నిత్యావసర వస్తువుల నిల్వల రికార్డులు పరిశీలించారు. ఆయనతో పాటు డీఆర్‌పీ గంగాధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రీసర్వేలో రైతులంతా భాగస్వామ్యం కావాలి



కొత్తలూరులో ర్యాలీలో పాల్గొన్న తహసీల్దారు సుజాత , సిబ్బంది

శావల్యాపురం: రీ సర్వేలో రైతులంతా భాగస్వామ్యం కావాలని తహసీల్దారు కె.సుజాత కోరారు. మండలంలోని కొత్తలూరులో రీ సర్వేపై బుధవారం రెవెన్యూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సుజాత మాట్లాడుతూ భూహక్కుదారులంతా సహకారం అందించి సమగ్ర సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు ఇవ్వాలని కోరారు. భూముల సరిహద్దులను రెవెన్యూ అధికారులకు చూపించాలని తెలిపారు. గ్రామంలో ఈనెల 28న రీ సర్వేపై రైతులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు వేమల వెంకట నాగ రాజు, పేరిసోముల నాసరయ్య, మండల సర్వేయర్ రాజు, వీఆర్వోలు ఉప్పటూరి చిన మంగయ్య, మల్లెల రాధ, వీరవల్లి నాగ సంతోషలక్ష్మి, గ్రామ నౌకర్లు, రైతులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే మహిళా అభివృద్ధి సాధ్యం



అక్షర వెలుగు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీడీవో ఉమాదేవి

వినుకొండ(నూజెండ్ల): అక్షరాస్యతతోనే మహిళా అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో పి.ఉమాదేవి అన్నారు. నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళలకు ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అక్షర వెలుగు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ చిన్నతనంలో చదువుకోని 15 సంవత్సరాల నిండిన మహిళలను అక్షరాస్యులను చేసి జీవన ప్రమాణాలు పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలంతా అక్షరాస్యులుగా ఉండాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి యానిమేటరు వలంటీరుగా బాధ్యతలు చేపట్టి, వారి గ్రూపులోని నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులను మార్చాలని తెలిపారు. అనంతరం ఉల్లాస్ అవగాహన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్త్రీనిధి జిల్లా మేనేజర్ చిన బుల్లెయ్య, ఏపీఎం రామాంజనేయులు, మండల సమాఖ్యా అధ్యక్షురాలు గుంటుపల్లి సుజాత, సీసీలు కొండలు,వెంకటరావు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



మందులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

రొంపిచర్ల : ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి సూచించారు. మండలంలో వీరవట్నం, వడ్లమూడివారిపాలెం గ్రామాలలో బుధవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాలలో గల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. ఎన్‌సీడీ, క్యాన్సర్ స్క్రీనింగ్‌ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ వివరాలపై ఆరా తీశారు. వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



శావల్యాపురం: 69వ జాతీయ చాంపియన్‌షిప్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్రం తరఫున బాలికల జట్టులో శావల్యాపురం విద్యార్థి కామినేడి కావ్య సత్తా చాటినట్లు పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి బుధవారం తెలిపారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని నాగపూర్ జిల్లాలో ఈనెల 17 నుంచి 21 వరకు జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆమె సిల్వర్ మెడల్ సాధించినట్లు చెప్పారు. శావల్యాపురంలో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఇంటరు సెకండ్ ఇయర్ చదువుతున్న కావ్య సత్తా చాటి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తెచ్చిందని పేర్కొన్నారు. ఆమెను ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ బెజవాడ వెంకట నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరావు, సురేష్, అబ్దుల్లా, నిర్మల, భువనేశ్వరితో పాటు రాష్ట్ర బాల్ బ్యాడ్మింటిన్ అసోసియేషన్ సభ్యులు మురళి, గుంటూరు ఉమ్మడి జిల్లా సెక్రటరీ వై.శ్రీనివాసరావు, ప్రెసిడెంటు ఈ.శివశంకర్ అభినందనలు తెలిపారు.

తహసీల్దార్‌గా ధనలక్ష్మికి పదోన్నతి



నాదెండ్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సీలి ధనలక్ష్మికి తహసీల్దార్‌గా పదోన్నతి లభించింది. ఈమె 2019లో గ్రూప్–2 ద్వారా డీటీగా పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. 2023 అక్టోబర్‌లో బదిలీపై నాదెండ్ల కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్‌గా పదోన్నతి లభించటంతో ప్రస్తుత తహసీల్దార్ ఏవీ రమణ, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

శనగ రైతులంతా అప్రమత్తంగా ఉండాలి

యడ్లపాడు: శనగ రైతులంతా అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి సీహెచ్. సరిత సూచించారు. మండలలోని యడ్లపాడు, తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీ సీజన్లో సాగు చేస్తున్న శనగ, మొక్కజొన్న, మినుము, పెసర పైర్లను వ్యవసాయ అధికారి పరిశీలించారు. శనగ పంట సాగు చేస్తున్న రైతుల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ ప్రస్తుతం 60–70 రోజుల వ్యవధిలో ఉన్న శనగ పైరును అక్కడక్కడా ఎండు తెగులు ఆశించిందని తెలిపారు. నివారణకు బైటాక్స్ లేదా కార్బెన్ డైజిమ్ పొడి మూడు గ్రాములను లీటరు నీటికి కలిపి చల్లుకోవాలని చెప్పారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణపై అవగాహన

రొంపిచర్ల: మండలంలోని మునుమాక, విప్పర్లపల్లి గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న, మిర్చి, శనగ పైర్లను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ముఖ్యంగా మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు నివారణపై రైతుల్లో అవగాహన కల్పించారు.

సాగులో అప్రమత్తత అవసరం

నాదెండ్ల: రబీలో సాగవుతున్న మొక్కజొన్న, వరి, శనగ, కంది పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి రైతులకు వివరించారు. సాతులూరు, గొరిజవోలు గ్రామాల్లో బుధవారం నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, స్థానిక ఏవో హరిప్రసాద్, సిబ్బందితో కలిసి పొలం పిలుస్తోంది నిర్వహించారు.

ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత మృతి

చిలకలూరిపేట టౌన్: స్థానిక కృష్ణనగర్‌కు చెందిన పమిడిశెట్టి సోమేశ్వరరావు కుమార్తె లహరి(21)కి, వినుకొండ తిమ్మాయపాలేనికి చెందిన సమీప బంధువు రాయల గోపీతో మూడు నెలల కిందట ప్రేమ వివాహం జరిగింది. ప్రస్తుతం గర్భవతి అయిన లహరి ఈనెల 2న తన జన్మదినం సందర్భంగా పుట్టింటికి వచ్చింది. టైఫాయిడ్ రావడంతో అప్పటి నుంచి ఇక్కడే ఉంటోంది. ఇద్దరి మధ్య ఏమి జరిగిందో తెలియదు కాని లహరి ఈనెల 18 అర్ధరాత్రి ఎలుకల మందు తింది. వాంతులు చేసుకోవడం గమనించిన కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని, పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స నిర్వహించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. చికిత్స పొందుతూ లహరి మంగళవారం రాత్రి మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.